# రైతుల నోట్లో మట్టి కొట్టేటోళ్లను తరిమి కొట్టాలి

- ఆడబిడ్డల పెండ్లికి రుమాలు ఇవ్వనోళ్లు.. మహిళల సంక్షేమం గురించి మాట్లాడితే ఎలా..?
- ఓటమి భయంతోనే మత్తులో ఉంటూ.. సీఎం అభ్యర్థినంటూ ప్రచారం
- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- నల్లగొండ మండలంలో ప్రచారం



నల్లగొండ రూరల్: అన్నెపర్తి రోడ్ షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పక్కన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చకిలం అనిల్ కుమార్, చెరుకు సుధాకర్

నల్లగొండ రూరల్, నవంబర్ 17 : ఎకరం ఉంటే గంట కరెంట్, మూడు ఎకరాలు ఉంటే మూడు గంటల కరెంట్ ఇస్తామని రైతుల నోట్లో మట్టి కొట్టేలా మాటలు చెబుతున్నా కాంగ్రెసోళ్లను ఈ ఎన్నికల్లో తరిమి కొట్టాలని బీఆర్‌ఎస్ నల్లగొండ అభ్యర్థి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ మండలం అన్నెపర్తి ,బుద్దారం, అప్పాజీపేట, రాములబండ,రంగారెడ్డినగర్, దోమలపల్లి, నర్సింగ్‌భట్ల, పాతూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడబిడ్డ పెళ్లికి చేతి రుమాలు ఇవ్వనోళ్లు ఇయ్యాల మహిళల సంక్షేమ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఓటమి భయంతోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎప్పుడూ మత్తులో తూళుతున్నాడని, అందుకే సీఎం అభ్యర్థి తానే అంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచి తరిమికొడితే మళ్లీ రాడన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చకిలం అనిల్ కుమార్, చెరుకు సుధాకర్ మాట్లాడుతూ నల్లగొండలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి కావాలంటే కంచర్ల భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, వైస్ చైర్మన్ తవిట కృష్ణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, బకరం వెంకన్న, మహిళ విభాగం అధ్యక్షురాలు కొప్పోల విమలమ్మ, కాసర్ల విజయ రెడ్డి, సర్పంచులు మేకల అరవింద్‌రెడ్డి, పబ్బతి రెడ్డి రవీందర్ రెడ్డి, బకరం యాదమ్మ, రూపాని జయమ్మాపెద్దులు, మామిళ్ల సైదులు , ఉపేంద్రచారి, చామకూరి తేజస్వీని, కారింగ్ సైదులు, బడుపుల శంకర్, పొగాకు ఘట్టయ్య, బుచ్చిరెడ్డి , మాజీ జడ్పీటీసీ తుమ్మల రాధాలింగస్వామి, మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షం, డాక్టర్ సుహాస్, గోపాల్ రెడ్డి , పనస శ్రీను పాల్గొన్నారు.



నల్లగొండ మండలం బుద్దారంలో రోడ్ షోకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

## గడప గడపకూ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలి

నల్లగొండ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడప గడపకూ తీసుకెళ్లి వివరించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దసూరారంలో తిప్పర్తి మాజీ వైస్ ఎంపీపీ పెండెం అరుణ నివాసంలో నిర్వహించిన శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు గుండె కృష్ణయ్య, ఎర్రమాద రాంరెడ్డి, వి.కరుణాకర్‌రెడ్డి, ఎం.రాంబాబు,పెంటయ్య, శంకరయ్య, సుందర్, తంతెనపల్లి కృష్ణయ్య, యూత్ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజియొద్దీన్, పక్కన జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

# ఎంఐఎం మద్దతు బీఆర్‌ఎస్‌కే..

- నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల గెలుపునకు ఎంఐఎం కార్యకర్తలు కృషి చేయాలి
- సీఎం కేసీఆర్‌తోనే మైనార్టీలకు రక్షణ, సంక్షేమం
- ఎంఐఎం అధ్యక్షుడు రజియొద్దీన్

నల్లగొండ, నవంబర్ 17: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికే ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రజియొద్దిన్ తెలిపారు. నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు చకిలం అనిల్ కుమార్‌తో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దిన్ ఒవైసీ ఆదేశాల ప్రకారం నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇమామ్‌లకు గౌరవ వేతనం, గురుకుల విద్యాలయాలతో పాటు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు తెలిపారు.నల్లగొండలో ఎంఐఎం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నాలుగు సార్లు మద్దతు ఇస్తే ఆయన చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. నల్లగొండ మరింత అభివృద్ధి జరగాలంటే మరోసారి కంచర్ల గెలువాల్సిన అవసరం ఉందన్నారు.

### మైనార్టీలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా :కంచర్ల భూపాల్ రెడ్డి

నల్లగొండ నియోజక వర్గంలో మైనార్టీల కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కుల మతాలకు అతీతంగా కేసీఆర్ అభివృద్ధి ఫలాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఐఎం మద్దతు ఇచ్చి మరోసారి నన్ను గెలిపిస్తే మైనార్టీలను తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాను అన్నారు. గత రెండు పర్యాయాలు తన వెంట ఉన్న మైనార్టీలు ఈ సారి కూడా పూర్తి స్థాయిలో తగిన సాకారం అందించాలని కోరారు.

### బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడం శుభపరిణామం

నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి గెలుపు కోసం ఎంఐఎంమద్దతు ఇవ్వడం శుభ పరిణామం అని జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, నాయకులు చకిలం అనిల్ కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ తోనే మైనార్టీల సంక్షేమం ఉంటుందని అన్నారు. 2014 నుంచి కూడా కేసీఆర్‌కే మద్దతు ఇచ్చిన ఎంఐఎం మరోసారి ఇవ్వడం సంతోష కరమన్నారు. ఈ సమావేశంలో ఎంఐఎం పట్టణాధ్యక్షుడు నజీబ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, కనగల్ ఎంపీపీ కరీంపాషా, కటికం సత్తయ్య గౌడ్, జమాల్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఎంజీయూ ఖ్యాతి చాటాలి

- ఎంజీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి

రామగిరి, నవంబర్ 17 : జాతీయ స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో ఎంజీయూ జట్టు సత్తా చాటాలని ఇన్‌చార్జ్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి సూచించారు. నల్లగొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించి ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్(ఐసీటీ) వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎంజీయూలో విద్యతోపాటు క్రీడాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 పురుషుల, 10 మహిళ జట్లు వచ్చాయి. పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. కాగా మహిళ విన్నర్‌గా సాం ఘిక సంక్షేమ శాఖ ఆర్మీ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల భువనగిరి జట్టు, రన్నర్‌గా డాక్టర్ ఎంఎంఆర్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల చౌటుప్పల్ జట్టు నిలిచాయి. శనివారం పురుషుల విభాగం పోటీలు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, డా|| ఆర్.మురళీ, వివిధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో తొలి విజయం



ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో పాల్గొన్న రాష్ట్ర జట్టు సభ్యులు

రామగిరి, నవంబర్ 17: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ 2023–24 హాకీ పోటీలు భువనేశ్వర్‌లో జరుగుతు న్నాయి. తెలంగాణ జట్టులో నల్లగొండ డీఈఓ కార్యాలయంలో అసిస్టెంట్ పరీక్షల కమిషనర్‌గా పనిచేస్తున్న యూసుఫ్ షరీఫ్, జడ్పీహెచ్‌ఎస్ మాడ్గులపల్లి పీఈటీ గుండా శ్రీనివాస్, జడ్పీహెచ్‌ఎస్ ఎంఆర్‌సీ హాలియా హై స్కూల్ గణిత ఉపాధ్యాయుడు అద్దంకి సునీల్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు తొలి మ్యాచ్ ఛత్తీస్‌గడ్–తెలంగాణ రాష్ట్రాలు పోటీ పడగా తెలంగాణ జట్టు 4–2 స్కోర్‌తో విజయం సాధించినట్లు తెలిపారు. వీరికి డీఈఓ భిక్షపతి తోపాటు తెలంగాణ హాకీ టీం మేనేజర్ లెడ్ల నరేశ్ కుమార్, ఆనంద్‌కుమార్ అభినందనలు తెలిపారు.

## ఉమెన్స్ కళాశాలలో పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం

రామగిరి, నవంబర్ 17: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఘన్‌శ్యాం ప్రారంభించి మాట్లాడారు. కళాశాలలో గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం పుస్తకాలు చదవడంతో పోటీ పరీక్షల్లో విజయం సాధించడం సులభమవుతుందన్నారు. మన కళాశాల గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు, జర్నల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు సుంకరి రాజారాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ, నవంబర్ 17: బీఆర్‌ఎస్ నల్లగొండ అభ్యర్థి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికి మరో అవకాశమిస్తే అభివృద్ధిలో నల్లగొండ రూపురేఖలే మారుతాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని ఆరో వార్డు శాంతి నగర్ నుంచి బొల్లెద్దు రఘు, సుంకిరెడ్డి, నరేందర్‌రెడ్డి, బొమ్మరబోయిన ముత్యాలు, బొల్లెద్దు నరేందర్, దుస్స వెంకన్న, బరుసు సురేశ్ కుమార్, కర్నాటి లింగారెడ్డి, ఇమ్రాన్, గోలి నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## బీఆర్‌ఎస్‌తోనే రాజుపేట అభివృద్ధి : సర్పంచ్ పురుషోత్తం



రాజుపేటలో ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్ బత్తిని పురుషోత్తం

తిప్పర్తి, నవంబర్ 17 : బీఆర్‌ఎస్ పాలనలోనే రాజుపేట గ్రామ పంచాయతీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందిందని సర్పంచ్ బత్తిని పురుషోత్తం తెలిపారు. బీఆర్‌ఎస్ నల్లగొండ అభ్యర్థి , ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మద్దతుగా గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రెండోసారి ఎమ్మెల్యేగా కంచర్ల భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.కార్యక్రమంలో రాజుపేట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.